ఆక్రమణలపై హైడ్రా కొరడా

చెరువుల్లో వెలసిన కట్టడాల కూల్చివేత

20 ప్రహరీలు, ఆరు నిర్మాణాలు నేలమట్టం

స్థిరాస్తులు కొనేముందు హైడ్రాను సంప్రదించాలి: కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో/బండ్లగూడ, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. గ్రేటర్ పరిధిలో వరుస దాడులతో అక్రమ నిర్మాణాలు, కబ్జాలను తొలగిస్తున్నారు. శనివారం సైతం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని బూమ్రుఖుద్దీన్ దవాళ్ చెరువు, చందానగర్ ప్రాంతంలోని ఎర్ర చెరువు బఫర్ జోన్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. దాదాపు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బూమ్రుఖుద్దీన్ దవాళ్ చెరువులో అధికారుల నిర్లక్ష్యంతో బఫర్ జోన్లలో నిర్మాణాలు జోరందుకున్నాయి. దాదాపు 10 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు.. మొత్తం 20 ప్రహరీలు, 6 నిర్మాణాలను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్ కూల్చివేతలను నిలిపివేయాలని హైడ్రా సిబ్బందిని అడ్డుకోగా, పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

సిటీ పరిధిలో చెరువులకు సంబంధించిన బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో రియల్టర్లు, బిల్డర్ల నిర్మాణాలు అక్రమమని తేలితే చట్టపరంగా కూల్చివేస్తాం. వారికి సహకరించే అధికారులపై కూడా చర్యలుంటాయి. చెరువులు, కుంటల సమీపంలో స్థిరాస్తులను కొనుగోలు చేసే ముందు ఓ సారి హైడ్రా కార్యాలయాన్ని సంప్రదించడం మంచిది.

– రంగనాథ్, హైడ్రా కమిషనర్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

శంషాబాద్ రూరల్, ఆగస్టు 10 : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు శనివారం తన నివాసం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు వైద్య సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది బాధిత కుటుంబ సభ్యులకు రూ.8,62,500ల చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, నీరటి రాజుముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

తాండూరులో నిరసన ర్యాలీ చేస్తున్న హిందూ ఐక్యవేదిక

దమనకాండపై భగ్గుమన్న తాండూరు

- నిరసన ర్యాలీలో కదం తొక్కిన హిందువులు
- ఐక్యవేదిక స్వచ్ఛంద బంద్ సంపూర్ణం

తాండూరు, ఆగస్టు 10 : బంగ్లాదేశ్‌లో హిందువులపై సాగిస్తున్న దమన కాండపై తాండూరు భగ్గుమన్నది. శనివారం తాండూరు ఐక్య వేదిక పిలుపుతో తాండూరులో బంద్ సంపూర్ణమైంది. పట్టణంలోని హోటళ్లు, వస్త్ర, వాణిజ్య, కిరాణ, బంగారు తదితర దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. నెహ్రూ గంజ్ ఎల్లమ్మ దేవాలయం నుంచి శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పార్టీ లకతీతంగా రాజకీయ నాయకులు, సంఘాల నాయకులు, వ్యాపారులు భారీఎత్తున పాల్గొన్నారు. దేశంలో విద్రోహ వ్యతిరేక విధానాలకు పాల్పడేవారిని తరిమికొట్టాలన్నారు. దాడులకు పాల్పడేందుకు యత్నిస్తే హిందువులందరూ సంఘటితం కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

273 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

సీసీఎస్‌లో భారీ ప్రక్షాళన..

కార్ హెడ్ క్వార్టర్స్‌కు 81 మంది అటాచ్

సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ

సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): కమిషనరేట్ పరిధిలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న 273 మంది పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ..శుక్రవారం రాత్రి సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు ఇన్‌స్పెక్టర్లను మల్టీజోన్‌కు పంపించగా, అక్కడి నుంచి వచ్చిన వారితో పాటు వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ అయిన వారిలో 51 మంది ఇన్‌స్పెక్టర్లు, 81 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లకు గతంలో అటాచ్‌మెంట్‌లో ఉన్న మరో 10 సబ్ ఇన్‌స్పెక్టర్లు సైతం ఉన్నారు. 141 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ప్రత్యేకంగా ఇందులో 22 మందిని సైబర్‌క్రైమ్‌కు, 16 మందిని సీసీఎస్‌కు కేటాయించారు. కాగా, సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)లో భారీ ప్రక్షాళన చేశారు. 81 మంది సిబ్బందిని ఒకేసారి కార్(సిటీ ఆర్మ్డ్ రిజర్వు) విభాగానికి అటాచ్ చేశారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత పంజాగుట్ట ఠాణాలో ఒకేసారి భారీగా బదిలీలు చేసిన విషయం తెలిసిందే. అదే తరహా సీసీఎస్‌లోనూ తాజాగా బదిలీలు జరిగాయి. కేసుల సెటిల్‌మెంట్లు, అవినీతి ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నారు.

శుభాకాంక్షలు



నవాబుపేట మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఆర్ఎస్ మండల నాయకులు – నవాబుపేట, ఆగస్టు 10

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నవీన్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 10 : తనపై నమ్మకంతో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శిగా నియమించినందుకు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గానికి రుణపడి ఉంటానని నవీన్‌కుమార్ అన్నారు. తనను బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియమించారన్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కార్యవర్గ విస్తరణ జరిగిందన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఉన్నత బాధ్యతలివ్వడంతో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతూ బీజేపీని బలోపేతం చేస్తామన్నారు.

నేడు కరెంటు సరఫరా నిలిపివేత

పరిగి, ఆగస్టు 10 : విద్యుత్ లైన్‌వర్క్స్, నిర్వహణ పనుల వల్ల ఈ నెల 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరిగిలోని బహార్‌పేట్ హనుమాన్ మందిర్, వాగ్దేవి హాస్పిటల్, వల్లభ్‌నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, శ్రీనివాస్ కాలనీ, తుంకులగడ్డ, నస్కల్ రోడ్డు, మార్కెట్ యార్డు, గంజ్, శాంతినగర్, సయ్యద్‌వాడ, నాయకోటివాడ ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఖాజా ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మనాజీర్

పరిగి, ఆగస్టు 10 : ఓ వ్యక్తి తప్పిపోయిన సంఘటన పరిగిలో జరిగింది. పరిగి మండలంలోని ఖుదావంద్‌పూర్ గ్రామానికి చెందిన మనాజీర్, అతడి భార్య షేక్ సనాబేగం రెండు సంవత్సరాలుగా పరిగిలో నివాసముంటున్నారు. మనాజీర్ ఎలక్ట్రీషియన్‌గా, షేక్ సనాబేగం టైలర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 8నఉదయం 9.30 గంటల సమయంలో షేక్ సనాబేగం టైలరింగ్ పని నిమిత్తం బహార్‌పేట్‌కు వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా భర్త కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువులను అడుగగా అతడి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు శనివారం తన భర్త మనాజీర్ తప్పిపోయినట్లు షేక్ సనాబేగం పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదం జరిగినా.. పట్టించుకోరా..!

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 10: ప్రధాన రహదారులపై విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండాపోతున్నదని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికురాలిని నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికురాలు జి.సరస్వతిని శనివారం ఉదయం బైక్‌పై స్పీడ్‌గా వచ్చిన ఓ వ్యక్తి ఢీకొట్టగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె కోమాలోకి వెళ్లినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. ఇంత ప్రమాదం జరిగినా అమెను ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులు పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆనంద్, రాజు ఉన్నారు.

ఉద్యోగ విరమణ అభినందన సభ

పీఏసీఎస్ సీఈవో ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న చైర్మన్ సతీష్‌రెడ్డి

పూడూరు, ఆగస్టు 10 : ఉద్యోగం చేసిన ప్రతి వ్యక్తి రిటైర్డ్ కాతప్పదని పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పూడూరు మండల పీఏసీఎస్ సొసైటీ సీఈవో జంగయ్య ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించి సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. 36 సంవత్సరాల నుంచి పూడూరు మండలంలోని ఆయా పీఏసీఎస్‌ల సొసైటీలో పనిచేస్తూ ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఆయన రైతులతో కలిసిమెలిసి ఉంటూ సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఉండాలని, భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో అష్టావధాని అంజయ్య, ఎంపీడీవో సత్తయ్య, కో ఆపరేటివ్ యూనియన్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ గణేశ్, వికారాబాద్ కో ఆపరేటివ్ మేనేజర్ మమత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ అంజయ్య, అడ్వకేట్ వెంకటయ్య, సొసైటీ డైరెక్టర్లు వైస్ చైర్మన్ వీరయ్యగౌడ్, జైపాల్‌రెడ్డి, చిన్నయ్యగౌడ్, వెంకటయ్య, శ్రీశైలంగౌడ్, రాములు నాయక్, పీఏసీఎస్ సీఈవో ఖలీల్, కుటుంబ సభ్యులున్నారు.

మనసా వాచా కర్మణా ప్రార్థిస్తే శుభ ఫలితాలు

మహా అన్నదానం నిర్వహిస్తున్న మంజుల రవీందర్‌గౌడ్ దంపతులు

యాలాల, ఆగస్టు 10 : ఇష్టదేవాన్ని శ్రావణమాసంలో మనసా వాచా కర్మణా ప్రార్థిస్తే అనుకున్న కోరికలు తీరడమే కాకుండా భగవంతుడి కృపా కటాక్షాలు లభిస్తాయని జుంటుపల్లి దేవస్థాన అర్చక పురోహితుడు ఆదిరావు అన్నారు. శనివారం శ్రావణమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని యాలాల మండల పరిధిలోని జంటుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మంజుల రవీందర్‌గౌడ్ దంపతులు సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజ అర్చనలతో పాటు దేవస్థాన ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త హనుమంతరావు, డాక్టర్ రవీందర్రావు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 21 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై శనివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొని నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. – మర్పల్లి, ఆగస్టు 10

ఎయిర్‌పోర్టులో 10కే రన్ ప్రారంభం

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శనివారం బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 కే మారథాన్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 కే మారథాన్‌తో విమానయాన భద్రత కీలకమైన ప్రాముఖ్యతను వివరించారు. మారథాన్‌లో బీసీఏఎస్, సీఐఎస్ఎఫ్,గోయల్ ఇతర వాటాదారులతో సహా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు సిబ్బంది 700 మంది రన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టులలో భద్రతను పెంపొందించడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని ఆందోళన చేస్తున్న 21వ వార్డు కాలనీవాసులు

సెల్ టవర్ మాకొద్దు

వికారాబాద్, ఆగస్టు 10 : సెల్ టవర్ మాకొద్దంటూ 21వ వార్డు కాలనీవాసులు శనివారం ఆందోళన నిర్వహించారు. సెల్ టవర్ నిర్మాణానికి ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని టవర్ నిర్మాణం చేపట్టవద్దని.. టవర్ నిర్మాణం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వాపోయారు. నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతులిచ్చారని సెల్ టవర్ నిర్మాణదారుడు చెప్తున్నాడని, కానీ స్థానిక ప్రజల అనుమతి లేకుండా మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని మండిపడుతున్నారు. ఇండ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం వల్ల అనేక ఆరోగ్య సమస్యలతో పాటు రేడియేషన్ ప్రభావంతో క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసుల సమస్యలను పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగిస్తే మున్సిపల్ కార్యాలయం పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

ఇండ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం

ఉన్నత శిఖరాలకు 'నైఫర్'

– డాక్టర్ అరుణిశ్ చావ్లా

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ అరుణిశ్ చావ్లా

బాలానగర్, ఆగస్టు 10 : నైఫర్ హైదరాబాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ బల్క్ డ్రగ్‌కు ఎంపికైందని కేంద్ర ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ అరుణిశ్ చావ్లా వెల్లడించారు. శనివారం బాలానగర్ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైఫర్) ఆడిటోరియం హాల్‌లో నైఫర్ డైరెక్టర్ శైలేంద్ర సరాఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ డ్రగ్ డిస్కవరీ, డెలివరీ డయగ్నోస్టిక్స్ 2024 (ఐసీడీ4-2024) సదస్సుకు ఆయనతో పాటు నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ సత్యనారాయణ, సీఎస్ఐఆర్ –ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నైఫర్ డీన్ నండూరి శ్రీనివాస్ హాజరయ్యారు.

అంతర్జాతీయ డ్రగ్ డిస్కవరీ సందర్భంగా నైఫర్ ప్రాంగణంలో మెడిసినల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాకాలజీ, మెడికల్ డివైసెస్ సహా వివిధ రంగాలకు చెందిన 131 పోస్టర్, 22 మౌఖిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సును పురస్కరించుకొని ప్రదర్శనలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అరుణిష్ చావ్లా.. మాట్లాడుతూ ఫార్మారంగంలో తనకంటూ ప్రత్యేకత సాధించుకున్న నైఫర్ హైదరాబాద్ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోనుందన్నారు. నైఫర్ హైదరాబాద్ సంస్థను విస్తరించడం కోసం 160 ఎకరాల స్థలాన్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. రూ. 100 కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఆమోదముద్ర వేసిందని ఆయన పేర్కొన్నారు.

'అన్ని రంగాల్లో సాంకేతికదే ముఖ్యపాత్ర'

సదస్సులో మాట్లాడుతున్న నల్సార్ వీసీ కృష్ణదేవరావు

శామీర్‌పేట : కృత్రిమ మేధ సాంకేతికత, చట్టం, న్యాయానికి మధ్య ఉన్న సంబంధాలపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్నదని నల్సార్ వీసీ కృష్ణదేవరావు అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం లా కమిషన్ ఆఫ్ ఇండియా సహకారంతో కృత్రిమ మేధ, చట్టం, న్యాయం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో సాంకేతిక ప్రముఖ పాత్ర పోషిస్తున్నదన్నారు. అందులో భాగంగా విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్న కృత్రిమ మేధకు చట్టం, న్యాయానికి ఉన్న సంబంధంపై అవగాహన అవసరమన్నారు. నాస్ కామ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, లా కమిషన్ ఆఫ్ ఇండియా మెంబర్ సెక్రటరీ డాక్టర్ రీతా వశిష్ట తదితరులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'హర్ ఘర్ తిరంగా'లో భాగస్వామ్యం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి : భారతీయ జనతా పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని చేవెళ్ల బీజేపీ పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. శనివారం అత్తాపూర్ డివిజన్ కార్యవర్గ సమావేశాన్ని హైదర్‌గూడలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు హాజరై మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు, యువమోర్చా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ, మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్కూటీ ర్యాలీలు నిర్వహించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580. NT- 332617

FARM PLOTS SALE

★ యావారం సాగర్ హైవే గజం: 4,999/- ప్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో & బాలానగర్ జడ్చర్ల బెంగుళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో, స్పాట్ రిజి॥ 7780483434. NT-332574

PLOT FOR SALE

★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగుళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142. NT- 326218

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహింపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962